క్లుప్తంగా

'హెల్పింగ్ హ్యాండ్స్' కృషి అభినందనీయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎస్సై రాములు

కమాన్‌పూర్: మండంలోని గుండారం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ రాసకొండ ప్రేమ్ ఇటీవల బ్రెయిన్ ట్యూమర్‌తో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థవారు సేకరించిన రూ.1.13 లక్షలను శుక్రవారం కమాన్‌పూర్ ఎస్సై రాములు చేతులమీదుగా అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ కృషి అభినందనీయమని అన్నారు. సంస్థ అధ్యక్షుడు నారగోని సతీశ్, మేడగోని విజయ్, రెడ్డి చైతన్య, గడ్డం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామ పరిధి రాజాపూర్‌కు చెందిన కుంభం కనకయ్యకు కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఇటీవల కనకయ్య కాలు తీసివేయడంతో ఆస్పత్రి ఖర్చుల కోసం క్లబ్ ఆధ్వర్యంలో సాయం చేసినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సభ్యులు సాయిశంకర్, జబ్బార్‌ఖాన్‌లు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి..



ఆర్థికసాయం అందిస్తున్న భాగ్యలక్ష్మి, సత్యనారాయణ

సుల్తానాబాద్: మండలంలోని గర్రెపల్లికి చెందిన యశ్వంత్ నీట్‌లో ర్యాంకు ద్వారా ఉచితంగా మెడికల్ సీటు సాధించాడు. అతను ఖర్చులకు ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అల్లం భాగ్యలక్ష్మి-సత్యనారాయణ దంపతులు శుక్రవారం రూ.10 వేలు అందించారు. కోర్సు పూర్తయ్యేవరకు ఏడాదికి రూ.10 వేల చొప్పున పంపిస్తామని హామీ ఇచ్చారు. యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులున్నారు.

ట్రినిటీ కళాశాలలో వర్క్‌షాప్



మాట్లాడుతున్న డైరెక్టర్ అశోక్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం నెక్సస్ వేవ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో బిల్డ్ యువర్ ఓన్ జనరేట్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ మోడల్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. సాంకేతికపై విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకే వర్క్‌షాప్ నిర్వహించినట్లు అకాడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశ్ తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రామగుండం: ఒకటో డివిజన్ పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగం అధికారిణి తిరుపతమ్మ జేసీబీతో కూల్చివేయించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగేశ్వర్ హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ధర్మారం: కటికెనపల్లి పంచాయతీ పరిధిలోని కొండన్నపల్లిలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కారుపాకల రాజయ్య, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఉపసర్పంచ్ రామడుగు గంగారెడ్డి, చామనపల్లి సర్పంచ్ దాసరి తిరుపతి, బీఆర్‌ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు కనకలక్ష్మి ఉన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల నిరసన

రామగిరి: తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహసీల్దార్ రాంచందర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆకుల వెంకన్న తదితరులున్నారు.

బొడ్డెమ్మ వేడుకలు



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభించారు. మహిళలు బొడ్డెమ్మ తయారు చేసి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- 62 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



పట్టాలు ఇస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

సుల్తానాబాద్: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జీవో 58 కింద 62 మంది లబ్ధిదారులకు ఉచిత ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతులకు రుణమాఫీ, దళిత బంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు ద్వారా అన్ని వర్గాలను ఆదుకుంటున్నారని తెలిపారు. దివ్యాంగులకు పెన్షన్ పెంచిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత, ఎంపీపీ బాలాజీరావు, ఆర్డీవో మధుమోహన్, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మౌనిక, కౌన్సిలర్లు మమత, సంపత్, జ్ఞానేశ్వరి, గణపతి, గోపి, సునీత, రాజు, లక్ష్మి, అరుణ, బాబూరావు, తిరుపతి, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్ చందర్‌రావు, సర్పంచ్ మోహన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

అబద్ధాల కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు

పెద్దపల్లిరూరల్: అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయని కాంగ్రెస్ పార్టీ నాయకులు అమలు సాధ్యం కాని అబద్ధాల మేనిఫెస్టోతో మోసగించేందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట, బొంపల్లి గ్రామాల్లో శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ సారథ్యంలో అద్భుతంగా తీర్చిదిద్దుకుంటూ దేశంలోని ఆదర్శంగా నిలిపామన్నారు. పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సింగిల్‌విండోల చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

పాలకుర్తి: బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం పాలకుర్తి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధే లక్ష్యంగా పనిచేసున్న బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించి, కారు గుర్తుపై ఓటువేసి, గెలిపించాలని కోరారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ అనసూర్య, వైస్ ఎంపీపీ స్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు కౌశిక హరి తదితరులున్నారు.

మేరు సంఘం భవనం ప్రారంభం

గోదావరిఖనిటౌన్: స్థానిక కల్యాణ్‌నగర్‌లో మేరు సంఘం భవనాన్ని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక హరి, కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్, మేరు సంఘం అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.

కులాలకు, కుల సంఘాలకు తగిన గౌరవం

జ్యోతినగర్: రాష్ట్రంలోని కులాలు, కుల సంఘాలకు సీఎం కేసీఆర్ తగిన గౌరవాన్ని ఇస్తున్నారని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. 42వ డివిజన్‌లో మేరు సంఘం భవనాన్ని ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, బాలరాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన అరుణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

బీఆర్‌ఎస్‌వి ప్రజావ్యతిరేక విధానాలు

- మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఉద్యమకారులతో విజయరమణారావు



పెద్దపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఓదెల: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం ఓదెల మండలంలోని జీలకుంటలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీవి ప్రజావ్యతిరేక విధానాలని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. ఉద్యమకారులు పెరుమాండ్ల ఐలయ్య, జోన్నుతుల రవీందర్‌రెడ్డి, వంగల రాజిరెడ్డి, సుంకరి అనిల్‌రెడ్డి, కొరె తిరుపతి, దండు రాజయ్య, దొడ్డిపల్లి అశోక్, ఎగ్గిడి సమ్మయ్య, అగ్గి రాంచందర్, కంది రాజిరెడ్డి, గుజ్జుల రాజిరెడ్డి, కర్ర జైపాల్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, ఎంపీటీసీ సభ్యుడు రాగిడి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని ఆ పార్టీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు బి.సురేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జగదీశ్ కోరారు. 32వ వార్డులో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి, ఆరు గ్యారంటీలపై ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్‌కు పదేళ్లు పాలించే అవకాశం ఇస్తే అక్రమార్జనకు అలవాటు పడ్డారని ఆరోపించారు. నాయకులు నవీన్, ఆరిఫ్, తరుణ్, శివ, సంపత్, రాజు తదితరులున్నారు.

గ్యారంటీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

రామగిరి: కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ కోరారు. శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య ఆధ్వర్యంలో సెంటనరీకాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేసిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గెలుపునకు సమష్టిగా పని చేయాలని కోరారు. అనంతరం చిరు వ్యాపారులకు గొడుగులు అందజేశారు. టౌన్ అధ్యక్షుడు కాటం సత్యం, ఎంపీటీసీ సభ్యులు చిందం మహేశ్, గణపతి, మండల మహిళా అధ్యక్షురాలు రాధా రెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు సదానందం, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లిలో కార్డుల పంపిణీ

కమాన్‌పూర్: జూలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీ పథకాల కార్డులను శుక్రవారం ఇంటింటా పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన పథకాలపై గడపగడపకూ వెళ్లి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఓదెలు, రవీందర్, నాయకులున్నారు.

రామగుండం: అంతర్గాం మండలం లింగాపూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ ప్రతినిధులు సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, అర్శనపల్లి శ్రీనివాస్, అడిచెర్ల చంద్రమౌళి, ఎనగందుల సంతోష్, వడ్లకొండ రామస్వామి తదితరులున్నారు.

'ప్రతిపక్ష సర్పంచ్‌నని అవమానిస్తున్నారు'



మాట్లాడుతున్న సర్పంచ్ రజిత

ముత్తారం: స్థానికంగా గురువారం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించని ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌లపై కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ముత్తారం సర్పంచ్ తూటి రజిత తెలిపారు. అనంతరం ముత్తారంలోని ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. అధికార పార్టీ స్థానిక ప్రజాప్రతినిధితో అధికారులు కుమ్మక్కై, ప్రతిపక్ష పార్టీ మహిళా సర్పంచ్‌నని అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మహిళా సాధికారత మాటల్లో తప్ప చేతల్లో లేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన సర్పంచ్‌ని అవమానించిన వారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై కాంగ్రెస్ నిరసన



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల ప్రచారం కోసం మంథనిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ పార్టీ మంథని మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత పెట్రోల్ బంక్ సమీపంలో ధర్నా నిర్వహించారు. మున్సిపల్ అనుమతి తీసుకొని, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చించివేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజల్లో ఆదరణ కోల్పోతున్నందునే బీఆర్‌ఎస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

'వివాహ ధ్రువీకరణ పత్రం ఇస్తలేరు'



కరీంనగర్‌లో ఫిర్యాదు చేస్తున్న దంపతులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహ ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే ఇవ్వకుండా సబ్‌రిజిస్ట్రార్ సురేశ్‌బాబు ఇబ్బంది పెడుతున్నారని సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయికి చెందిన సుద్దాల సతీశ్-మానస దంపతులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత నెల 29న మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం నిబంధనల ప్రకారమే దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. మరుసటి రోజు ధ్రువపత్రం ఇస్తామన్న సబ్ రిజిస్ట్రార్ ఇప్పటికీ ఇవ్వడం లేదని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు అడిషనల్ కలెక్టర్ అభినందన



అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో డాడ్జ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డాడ్జ్ బాల్ పోటీల్లో పెద్దపల్లి గాయత్రి జూనియర్ కాలేజీకి చెందిన ఆరుగురు విద్యార్థినులు ప్రతిభను కనబర్చారు. జాతీయ పోటీలకు ఎంపికైన మంజుల, విద్య, త్రిష, కల్యాణి, కార్తీకప్రియ, ప్రసన్నలను జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్ శుక్రవారం అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ నెల 27 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని ఎల్లోరాలో జాతీయ స్థాయి పోటీలు జరుగుతాయని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ప్రిన్సిపాల్ సురేశ్, భానుప్రకాశ్ ఉన్నారు.

బతుకమ్మ చీరలు అందజేత



చీరలు అందిస్తున్న మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నారని రామగుండం నగరపాలక సంస్థ మేయర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక 30వ డివిజన్‌లో శుక్రవారం డివిజన్ మహిళలకు మేయర్ చీరలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమం కోసమే బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు వంగ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తానిపర్తి గోపాల్‌రావు, నాయకుడు మంద రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి, గుండారం, సిద్దిపల్లె గ్రామాల్లో ప్రభుత్వం మహిళల కోసం సరఫరా చేసిన బతుకమ్మ చీరలను ఎంపీపీ రాసకొండ లక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. గుండారం, పేరపల్లి, రొంపికుంట, నాగారం, పేంచికల్‌పేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు ఎంపీపీ రాసకొండ లక్ష్మి శుక్రవారం క్రీడాకిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బొల్లపెల్లి శంకర్ గౌడ్, తాటికొండ శంకర్, ఆకుల ఓదెలు, కట్కం రవీందర్, కొండ వెంకటేశ్, తొగరి అన్నపూర్ణ, ఇటవేన కొమురమ్మ, ఎంపీటీసీ సభ్యుడు బోనాల వెంకటస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మమల్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపీవో శేషయ్య సూరి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి శుక్రవారం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. 3వ డివిజన్‌లో కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, 23వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జి బుర్ర శంకర్ గౌడ్, కుమ్మరి శారద చీరలు అందజేశారు.

క్రీడా కిట్లు పంపిణీ

రామగిరి: అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి, క్రీడా కిట్లు అందిస్తున్నట్లు ఎంపీపీ ఆరెల్లి దేవక్క తెలిపారు. రామగిరి మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు కిట్లు రాగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అందజేశారు. గ్రామీణ యువత సద్వినియోగం వీటిని సద్వినియోగం చేసుకొని, క్రీడల్లో రాణించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మ్యాదరబోయిన శారద, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో భాస్కర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎలిగేడు: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. ఎలిగేడు మండల పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం క్రీడా కిట్లు పంపిణీ చేశారు. నాయకులు మోహన్‌రావు, రాజనర్సు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమలత, కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ నాగేశ్వర్

రామగుండం: స్థానిక హైస్కూల్‌ను శుక్రవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ సందర్శించారు. హెచ్‌ఎం అజ్మీరా శారద, ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికారు. పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారిస్తామని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమానికి బెంచీలు

ఫెర్టిలైజర్‌సిటీ: 14వ డివిజన్ వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో శుక్రవారం బెంచీలను అందజేశారు. క్లబ్ సభ్యురాలు సూర్యదేవర జ్యోతి-వెంకటేశ్వర్లు కుమార్తె పుట్టినరోజు సందర్భంగా బెంచీలు అందించినట్లు తెలిపారు. అధ్యక్షురాలు లక్ష్మీవాణి తదితరులున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పెద్దపల్లిరూరల్: స్థానిక ఓ పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యుత్‌తో ప్రమాదాలు జరిగే విధానాలను వివరించి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పరిశుభ్రత పాటించాలి

జూలపల్లి: విద్యార్థులు పరిశుభ్రత, ఆహార నియమాలు పాటించాలని జూలపల్లి మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సరస్వతి, సీహెచ్‌వో కలీమొద్దీన్ తదితరులున్నారు.

తపాలాశాఖ సేవలు వినియోగించుకోవాలి

జూలపల్లి: తపాలాశాఖ సేవలను వినియోగించుకోవాలని జిల్లా తపాలా శాఖ అధికారి పసునూరి ప్రభాకర్ కోరారు. జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లె పంచాయతీ కార్యాలయంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం తపాలా సేవలపై అవగాహన కల్పించారు. తక్కువ ప్రీమియంతో రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ రేచవేని రాధ, తపాలా శాఖ డివిజన్ అధికారి నరేశ్ తదితరులున్నారు.

బెస్ట్ యోగా మాస్టర్ అవార్డుకు ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ప్రముఖ యోగా గురువు చేరిపల్లి సుజాత బెస్ట్ యోగా మాస్టర్ అవార్డుకు ఎంపికైనట్లు జాతీయ అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్, బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆమెకు ఆహ్వానపత్రం అందజేశారు. ఈ నెల 15న ఢిల్లీలో నిర్వహించనున్న 4వ జాతీయ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

సంత్ సేవాలాల్ మహరాజ్ అవార్డుకు..

జ్యోతినగర్: బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) జాతీయ సంత్ సేవాలాల్ మహరాజ్ అవార్డుకు ఎన్టీపీసీ రామగుండంకు చెందిన లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్య సురేశ్ నాయక్ ఎంపికయ్యారు. అవార్డు సెలక్షన్ కమిటీ జాతీయ చైర్మన్ నల్లా రాధాకృష్ణ శుక్రవారం హైదరాబాద్‌లోని అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆయనకు అవార్డు ఎంపిక పత్రాన్ని అందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెద్దపల్లిరూరల్: పంచాయతీ వ్యవస్థలో అతికీలకంగా ఉన్న సాంకేతిక సమాచార వ్యవస్థను 13 ఏళ్లుగా సమర్థంగా నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి, పదోన్నతులు ఇవ్వాలని ఈ-పంచాయతీ ఆపరేటర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో వారు చేపడుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రజాక్, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

నేటి నుంచి సమ్మెలోకి..

రామగిరి: శుక్రవారం నుంచి రామగిరి మండల ఈ-పంచాయతీ ఆపరేటర్లు సమ్మె బాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో సమ్మె చేస్తున్నామన్నారు. మద్దతు ప్రకటించాలని కోరుతూ ఎంపీడీవో రమేశ్, ఎంపీపీ ఆరెల్లి దేవక్కలకు వినతి పత్రాలను అందజేశారు. ఆపరేటర్లు వెంకటేశ్, నూతన తదితరులున్నారు.

నేడు 'చలో అలంపూర్'

గోదావరిఖనిటౌన్: ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో శనివారం చేపట్టనున్న చలో అలంపూర్ మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర పోస్టర్లను శుక్రవారం గోదావరిఖనిలోని సమితి కార్యాలయంలో ఆవిష్కరించారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్ మాదిగ కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ఏఎంసీ ప్రచార రథం ప్రారంభం

కమాన్‌పూర్: స్థానిక మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని చైర్మన్ దాసరి రాయలింగు శుక్రవారం ప్రారంభించారు. పత్తి విక్రయించే సమయంలో పాటించాల్సిన నిబంధనలను రైతులకు వివరించేందుకు ప్రచార రథంతో గ్రామాల్లో ప్రచారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి



ప్రచారం చేస్తున్న రమేశ్

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించాలని తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేశ్ కోరారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌తోపాటు పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. స్థానికంగా సర్వీస్ రోడ్లు లేక ప్రమాదాలు జరిగి, పలువురు చనిపోతున్నారని తెలిపారు. నర్రాశాలపల్లె రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు గొర్రె అఖిల్ వర్మ, రామగుండం నియోజకవర్గ కన్వీనర్ బాజా వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.